క్లుప్తంగా

మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌కు శుభాకాంక్షలు



నేరెళ్ల శారదకు శుభాకాంక్షలు తెలుపుతున్న శ్రావణి తదితరులు

కందుకూరు: రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నియమితులై బుధవారం బాధ్యతలు చేపట్టిన నేరెళ్ల శారదకు మండల పరిధిలోని దెబ్బడగూడ మాజీ సర్పంచ్ ఏనుగు శ్రావణి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆమె వెంట గ్రామ నాయకులు, తదితరులు ఉన్నారు.

గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఎన్నిక



గ్రంథాలయ కమిటీ సభ్యులను సన్మానిస్తున్న గ్రామస్తులు

కందుకూరు: మండల పరిధిలో కొత్తూర్‌లో నూతనంగా గ్రంథాలయ అభివృద్ధి కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రంథాలయ కమిటీ చైర్మన్‌గా తోకల శ్రీనివాస్, వైస్ చైర్మన్లుగా అక్కెనపల్లి శ్రీనివాస్, కాకర్ల ప్రభాకర్, పొట్లగారి రవీందర్, ప్రధాన కార్యదర్శిగా దయ్యాల రాజు, కోశాధికారులుగా మీగడి శ్రీకాంత్, ఈర్లపల్లి ప్రసాద్, లకుమల్ల ప్రకాశ్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ మాట్లాడుతూ.. గ్రంథాలయాన్ని విద్యార్థులు, యువతతో పాటు గ్రామస్తులు అందరికీ అందుబాటులో ఉండేలా తీర్చిదిద్దుతామన్నారు. యువతకు చదువుపై ఆసక్తి పెరిగేలా పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలను అందుబాటులో ఉంచుతామన్నారు. అందరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు బండి నర్సింహా, పొట్టి ఆనంద్, ఏముల కృష్ణ, కర్నాటి బాబు, రవికుమార్‌రెడ్డి, పెరుమల్ల శేఖర్, దయ్యాల శ్రీనివాస్, పాశం శ్రీనివాస్, జ్ఞానేశ్వర్, బూషపోగు నవీన్, లకుమల్ల ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బస్తీ సమస్యలు పరిష్కరిస్తా

సరూర్‌నగర్ కార్పొరేటర్ శ్రీవాణి



అంబేడ్కర్‌నగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: బస్తీలో నెలకొన్న సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని అంబేడ్కర్‌నగర్‌లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దోమల నివారణకు చర్యలు తీసుకోవడంతో పాటు మురుగునీరు, శానిటేషన్ సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

10న విద్యార్థి పోరుగర్జన

నాగోలు: దళిత బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 10న నగరంలో నిర్వహించనున్న విద్యార్థి పోరుగర్జన సభ విజయవంతం చేయాలని హైదరాబాద్ అధ్యక్షులు కిరణ్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో ప్రకటించిన తేదీలను వాయిదా వేసి ఆగస్టు 10న విద్యార్థి పోరు గర్జన జరుగుతుందన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు టమాట రూ. 65, వంకాయ రూ. 28, బెండ రూ. 28, పచ్చిమిర్చి రూ. 55, కాకర రూ. 38, బీర రూ. 23, క్యాబేజి రూ. 35, ఫ్రెంచి బీన్స్ రూ. 55, క్యారెట్ రూ. 35, దొండ రూ. 30, చిక్కుడు రూ. 85, గోకర రూ. 35, బీట్‌రూట్ రూ. 23, క్యాప్సికం రూ. 60, ఆలు రూ. 38, దోస రూ. 20, సొర రూ. 9, పొట్ల రూ. 13, ఉల్లిగడ్డ రూ. 39, చామగడ్డ రూ. 37. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

నిధులు మంజూరు చేయాలని వినతి

యాచారం: మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లి గ్రామంలో పలు కాలనీల్లో సీసీ రోడ్లకు నిధులు మంజూరు చేయాలని ఆ గ్రామ యువత బుధవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి ఇబ్రహీంపట్నంలోని ప్రజాభవన్‌లో వినతి పత్రం అందజేశారు. గ్రామంలోని హనుమాన్ దేవాలయం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తదితర కాలనీల్లో సీసీ రోడ్లు లేక వర్షాలు కురిస్తే రోడ్లు బురదమయంగా మారుతున్నాయని తెలియజేశారు. ఈ విషయంలో స్పందించిన ఎమ్మెల్యే అవసరమైన నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువత వన్నాడపు శ్రీకాంత్, ఆరెపల్లి శ్రీశైలం, బండ రాజు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత లోపించి.. దుర్గంధం వ్యాపించి



రోడ్డు పక్కనే పడేసిన చెత్తాచెదారం

డంపింగ్‌యార్డుగా మారిన బాలాపూర్ పరిసరాలు

పట్టించుకోని అధికార యంత్రాంగం

బడంగ్‌పేట్: పరిశుభ్రత పాటించినందుకు బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు గతంలో జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డు దక్కింది. అలాగే తెలంగాణలో స్వచ్ఛ సర్వేక్షన్‌లో చాలాసార్లు ఉత్తమ అవార్డులను కార్పొరేషన్ సొంతం చేసుకుంది. కానీ ప్రస్తుతం ఎటు చూసినా డంపింగ్‌యార్డులే దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రజలు, స్థానిక వ్యాపార నిర్వాహకులు అధికారుల పనితీరుతో విసుగు చెందుతున్నారు.

మూటకట్టి పడేస్తున్నారు

బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలో 32 డివిజన్లు ఉండగా అన్ని డివిజన్లకు శానిటేషన్ సిబ్బందిని కేటాయించారు. అలాగే ప్రతి కాలనీలకు వెళ్లి చెత్తను సేకరించే ట్రాలీ ట్రాక్టర్లను ఏర్పాటు చేశారు. నిత్యం చెత్తను సేకరిస్తున్నప్పటికీ కొందరు నిర్లక్ష్యంగా కవర్లలో మూటకట్టి ఓపెన్ స్థలాల్లో పారేస్తున్నారు. ఇటీవల బాలాపూర్‌లో సేకరించిన చెత్తను తెచ్చి స్థానిక మిషన్ భగీరథ వాటర్‌ట్యాంక్ వద్ద డంప్ చేస్తున్నారు. వాటర్ ట్యాంక్ పక్కనే రాబోయే ఆదివారం ఆషాఢ బోనాలు ఘనంగా జరపడానికి బాలాపూర్‌వాసులు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వాటర్ ట్యాంకుకు ఇరువైపులా పోచమ్మ, నల్ల పోచమ్మ, ఎర్ర మైసమ్మ ఆలయాలున్నాయి. గుడికి బోనాలు, నైవేద్యాలు తీసుకువచ్చే భక్తులతో పాటు మొక్కులు తీర్చుకోవడానికి వచ్చే భక్తులు అసౌకర్యానికి లోనవుతారు.

పేరుకుపోయిన చెత్త

గత పది రోజులుగా బాలాపూర్‌లో సేకరించిన చెత్తను వాటర్ ట్యాంక్ పక్కన డంపింగ్ చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కార్పొరేషన్‌లో సేకరించిన చెత్తను జవహర్‌నగర్‌కు లేదా మరోచోటుకు నిత్యం తరలిస్తున్నారు. కొంతమంది చెత్తను సేకరించే మినీ ట్రాక్టర్లు అంత దూరం వెళితే డీజిల్ ఖర్చుల భారం అధికమవ్వడంతో ఇక్కడే డంపు చేస్తున్నారు. శానిటేషన్ అధికారులు అప్రమత్తమై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి



శానిటేషన్ అధికారులు పట్టించుకోవడం లేదు. బాలాపూర్‌లో చెత్తను సేకరించి స్థానికంగానే డంప్ చేస్తున్నారు. అలాగే ఆలయాల చుట్టుపక్కల వేసిన చెత్తను తొలగించాలి. ఈ సీజన్‌లో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఎవరు డంప్ చేస్తున్నారో విచారణ చేసి అధికారులు చర్యలు తీసుకోవాలి.

– తిమ్మని గిరీష్, బాలాపూర్ వాసి

అలాగే మూడు రోజుల్లో బోనాల పండగ ఉంది. అంతలోపు అధికారులు, పాలకులు సమన్వయంతో పేరుకుపోయిన చెత్తను తొలగించి ఆలయాలను శుభ్రంగా ఉంచాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ మధుమోహన్, బీజేపీ నాయకుల

ప్రొటోకాల్ పాటించని చరిత్ర వారిదే

- తుక్కుగూడ మున్సిపల్ చైర్మన్ మధుమోహన్
- ఎమ్మెల్యే సబితారెడ్డి వ్యవహారంపై బీజేపీ నాయకుల ప్రెస్‌మీట్

మహేశ్వరం: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అప్పటి మంత్రి సబితారెడ్డి గెలుపొందిన ప్రజాప్రతినిధులను పక్కనబెట్టి ఓడిన తమ నేతలను అధికారిక కార్యక్రమాల్లో వేదికలపై కూర్చోబెట్టారని తుక్కుగూడ మున్సిపల్ చైర్మన్ కాంటేకార్ మధుమోహన్ ఆరోపించారు. బుధవారం తుక్కుగూడలో ఆయన బీజేపీ నాయకులతో ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా ఉండి సబితారెడ్డి అధికారిక దుర్వినియోగానికి పాల్పడి ప్రతిపక్ష చైర్మన్, కౌన్సిలర్లపై అక్రమ కేసులు పెట్టించి వేధించారన్నారు. ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిపై కేసులు, అరెస్టులు చేసిన విషయాన్ని మరిచిపోయారా విమర్శించారు. గతంలో రావిర్యాలలో కుల సంఘాల భవనాలకు శంకుస్థాపనలో తనను బీఆర్‌ఎస్ గుండాల చేత వేదికపై నుంచి గెంటేసి, ఓడిన నేతలను వేదికపై కూర్చోబెట్టుకొని తనపై అట్రాసిటీ కేసు నమోదు చేయించారని ఆరోపించారు. అప్పట్లో ఎన్నోసార్లు ప్రొటోకాల్ పాటించకుండా మమ్మల్ని అవమానపరిచి, ఇప్పుడు మీకు ప్రొటోకాల్ లేదని గగ్గొలు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీజేపీ కౌన్సిలర్లు శివకుమార్‌గౌడ్, యాదగిరిరెడ్డి, బీజేపీ నాయకులు సుధాకర్, శివయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'సబితారెడ్డిని విమర్శించడం సరికాదు'

కందుకూరు: కాంగ్రెస్ నాయకులకు సబితారెడ్డిని విమర్శించే హక్కు లేదని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్‌ముదిరాజ్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాపాలన అని చెప్పు కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలోనే సీనియర్ మహిళా నాయకురాలు, ఎమ్మెల్యేగా ఉన్న సబితారెడ్డిని బోనాల చెక్కుల పంపిణీలో అవమానించడం సిగ్గుచేటన్నారు. ఏ హోదా ఉందని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిని ప్రభుత్వ కార్యక్రమంలో భాగస్వామ్యం చేస్తున్నారన్నారు. మంత్రిగా ఉన్నప్పుడు కూడా స్థానికంగా అందరిని ప్రొటోకాల్ ప్రకారం ఆమె కలుపుకుని పోయారని గుర్తుచేశారు. ఎన్నికలు నిర్వహించకుండా కాంగ్రెస్ నాయకులనే నేరుగా నామినేట్ చేసుకోవాలన్నారు. నిన్న, మొన్నటివరకు సబితారెడ్డి వెనక ఉన్న నాయకులే పార్టీ మారి ఆమెను విమర్శించడం బాధాకరమన్నారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీపై తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని జోస్యం చెప్పారు.

అరెస్టును నిరసిస్తూ ధర్నా

తలకొండపల్లి: మండల కేంద్రంలో ముందస్తు అరెస్టును నిరసిస్తూ బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, ధర్నా నిర్వహించారు. కడ్తాల్ మండల కేంద్రంలోని కేజీబీవీ గురుకుల పాఠశాల భవనం ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, దుద్దిల్ల శ్రీధర్ బాబు బుధవారం విచ్చేస్తున్న సందర్భంగా, సభ సజావుగా జరగడం కోసం పోలీసులు ముందస్తుగా బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, కడ్తాల్ మాజీ జెడ్పీటీసీ దశరథ్ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్‌లతో పాటు, మాజీ సర్పంచ్‌లు ఎల్ఎన్‌రెడ్డి, హరిశ్చంద్‌నాయక్, ఉప సర్పంచ్ పాండు నాయక్, తదితర నాయకులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా కడ్తాల్ పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్ మండల కేంద్రంలోని వివేకానంద విగ్రహం సమీపంలో బైఠాయించి ధర్నా నిర్వహించారు. అనంతరం వెంకటేశ్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నాయకులను ఎందుకు అరెస్టు చేశారన్నారు. ప్రశ్నించే ప్రజా గొంతుకలను అరెస్టు చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి చేతనైతే రాష్ట్రంలోని విద్యా సంస్థలు, విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్మా సత్యం, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్, డీసీసీ డైరెక్టర్ వెంకటేశ్, మాజీ సర్పంచ్ లలిత, శంకర్ నాయక్, జ్యోతయ్య, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శంకర్, పాండు, పంతు, నరేష్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్: మండల కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడానికి రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావులు హాజరయ్యారు. బీఆర్‌ఎస్ నాయకులు అడ్డంకులు సృష్టించవచ్చనే సమాచారంతో మాజీ జెడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్‌తో పాటు అనుచరులను, పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలను ఎస్ఐ వరప్రసాద్ పోలీస్ సిబ్బందితో ముందస్తు అరెస్ట్ చేయించి తలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దశరథ్‌నాయక్‌ను అదుపులోకి తీసుకున్నారనే సమాచారం తెలియడంతో పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు, దశరథ్‌నాయక్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిరసనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళన చేస్తున్న కార్యకర్తలకు, నాయకులకు నచ్చ చెప్పి అక్కడి నుండి పంపించి వేశారు.

పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదు

చంపాపేట: అభివృద్ధి పనుల్లో పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదని స్థానిక డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన డివిజన్ పరిధిలోని మాధవ నగర్ కాలనీలో సీసీ రోడ్డు పనులను సర్కిల్ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి కర్మన్‌ఘాట్ పోచమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో దశరథగౌడ్, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు హన్మంతరెడ్డి, మణిపాల్ రెడ్డి, అనసూయ, శంభుప్రసాద్, మోహన్‌రెడ్డి, ముత్యాలు పాల్గొన్నారు.

రాష్ట్ర మంత్రులకు వినతుల వెల్లువ

కడ్తాల్: మండల కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు బుధవారం మండల కేంద్రానికి విచ్చేసిన రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రులకు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువా కప్పి సన్మానించారు.

వినతుల వెల్లువ..

పర్యటనలో భాగంగా మంత్రులను స్థానిక నాయకులు, నిరుద్యోగ అభ్యర్థులు, ప్రజలు కలిసి పలు సమస్యలను వివరించారు. మండల కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రి,జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు భానుకిరణ్, రాజేశ్‌లు మంత్రులకు వినతి పత్రాలు సమర్పించారు. ఎక్వాయిపల్లి-మర్రిపల్లి మధ్య బీటీ రోడ్డు ఏర్పాటు చేయాలని మర్రిపల్లి గ్రామ నాయకులు మంత్రులకు వినతి పత్రం అందజేశారు. 2008 డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులు మంత్రులను కలిసి సమస్యను వివరించారు.అభ్యర్థుల తరఫున సంఘం అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రెడ్డి మంత్రులకు వినతిపత్రం అందజేశారు.

ప్రగతి చక్రం అవార్డులు

ఇబ్రహీంపట్నం: విధుల్లో మంచి ప్రతిభ కనబరిచిన ఆర్టీసీ సిబ్బందికి ఇబ్రహీంపట్నం డిపోలో ప్రగతి చక్రం అవార్డులను డిపో మేనేజర్ వెంకటనర్సప్ప బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రాజేశ్, ఎంఎఫ్ సత్తయ్య, ఉద్యోగులు పాల్గొన్నారు.

వీధిదీపాల నిర్వహణను మెరుగుపర్చాలి



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

సైదాబాద్: డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లోని వీధిదీపాల నిర్వహణను మెరుగుపర్చాలని టాన్స్‌కో అధికారులకు సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి సూచించారు. బుధవారం విద్యుత్‌శాఖ అధికారులతో కలిసి ఆమె సైదాబాద్‌లోని ఎస్‌బీహెచ్-ఏ కాలనీ, లోకాయుక్త కాలనీ, ఏపీఏయూ కాలనీల్లో పర్యటించారు. తమ కాలనీల్లోని పార్కుల్లో విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన వీధి దీపాలు వెలగటం లేదని, పలుచోట్ల స్తంభాలు శిథిలావస్థకు చేరుకున్నాయని కాలనీవాసులు కార్పొరేటర్‌కు వివరించారు. కార్పొరేటర్ సూచనల మేరకు అధికారులు ఎస్‌బీహెచ్-ఏ కాలనీలో శిథిలమైన స్తంభాన్ని సిబ్బందితో తొలగించి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేశారు. కాలనీల్లోని పార్కుల్లో వెలగని దీపాలను మార్చాలని కార్పొరేటర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్ట్రీట్‌లైట్స్ వర్కింగ్ ఇన్‌స్పెక్టర్ దుర్గారావు, విద్యుత్ లైన్‌మెన్ దినేష్, శరత్, వనజ, నీరజ పాల్గొన్నారు.

ఘనంగా ఏకలవ్యుడి జయంతి



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

మన్సూరాబాద్: ఏకలవ్యుడి జయంతి వేడుకలు మన్సూరాబద్‌లోని ఏకలవ్య కాలనీనగర్ వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్ ముఖ్య అతిథిగా హాజరై ఏకలవ్యుడి చిత్రపటానికి నివాళి అర్పించి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏకలవ్యుడి వారసులు ఎరుకల కులాల సంక్షేమానికి రూ.500 కోట్లు నిధులను బడ్జెట్‌లో కేటాయించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు వనం గంగయ్య, శేఖర్, రమేష్‌నాయక్, చర్ల రమేష్, స్వామి, చిన్ననర్సింహా, అనిత, భారతమ్మ, సమ్మయ్య పాల్గొన్నారు.

వీరభద్రీయ కులస్తుల సంక్షేమానికి కృషి



సావనీర్‌ను విడుదల చేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

ఎంపీ ఈటల రాజేందర్

మన్సూరాబాద్: తెలంగాణ వీరభద్రీయ (వీరముష్టి) కులస్తుల సంక్షేమానికి కృషి చేస్తానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మన్సూరాబాద్ ఎస్కే గార్డెన్స్‌లో బుధవారం నిర్వహించిన వీరభద్రీయ (వీరముష్టి) సంఘం, కేంద్ర కమిటీ స్వర్ణోత్సవ వేడుకల్లో ఆయన హాజరై సిల్వర్ జూబ్లీ సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. వీరభద్రీయ కులస్తుల డిమాండ్లు సమర్థనీయమని, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం వాటిని నెరవేర్చాలన్నారు. 2010లో వీరముష్టి కులస్తులకు అప్పటి ప్రభుత్వం రంగారెడ్డి జిల్లాలో 2 ఎకరాల స్థలం కేటాయించి, ఇప్పటికి పొజిషన్ చూపించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దరఖాస్తు చేసుకున్న వీరముష్టి కులస్తులకు రుణాలు మంజూరయ్యేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర ప్రభుత్వం అందించే సంక్షేమంలో వీరముష్టి కులస్తులకు ప్రాధాన్యం ఉండేలా చర్యలు చేపడుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్‌బిన్ బలాల, బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, మూసరాంబాగ్ కార్పొరేటర్ భాగ్యలక్ష్మి మధుసూధన్‌రెడ్డి, సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షుడు కాటేపల్లి వీరస్వామి, నాయకులు రాజేశ్వర్‌రావు, పోచయ్య, కొండయ్య, జంగయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



హస్తినాపురంలో పర్యటిస్తున్న కార్పొరేటర్ సుజాతనాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ అన్నారు. డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఆమె పర్యటిస్తూ పోచమ్మగడ్డలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రజలు తమ కాలనీలలో జరుగుతున్న అభివృద్ధి పనులలో భాగస్వాములు అయితే త్వరితగతిన పూర్తవుతాయన్నారు. కార్పొరేటర్ వెంట నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

ప్రగతిని చూసి ఓర్వలేకే ఆరోపణలు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బీఆర్‌ఎస్ నాయకులు, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ మైనార్టీ నాయకులు ఎస్.కె మహమ్మద్ అన్నారు. బుధవారం ఆర్‌కేపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖిల్లా మైసమ్మ దేవాలయంలో జరిగిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి రాష్ట్ర ప్రభుత్వంపై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. మహేశ్వరం నియోజకవర్గాన్ని మరో కొత్త నగరంగా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుంటే ప్రజా ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ హయాంలో అనేక సార్లు ప్రోటోకాల్ ఉల్లంఘించిన సబితా ఇంద్రారెడ్డి ఇప్పుడు ప్రోటోకాల్ పాటించడం లేదని నిరసన తెలపడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సమావేశంలో హైమద్, యూసుఫ్, మొయిన్, షోహెబ్ అఖ్తర్, గౌస్, రఫీక్ బాబా పాల్గొన్నారు.



మహేశ్వరం: మన్సాన్‌పల్లిలో పీరీలను ఊరేగిస్తున్న ముస్లింలు



మహేశ్వరం: అమీర్‌పేట్‌లో పీర్లకు ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న బీఆర్‌ఎస్ యువ నాయకుడు కార్తీక్‌రెడ్డి తదితరులు

భక్తిశ్రద్ధలతో మొహర్రం

మహేశ్వరం: మండల పరిధిలోని అమీర్‌పేట్, నందుపల్లి, మన్సాన్‌పల్లి, పెండ్యాల, దుబ్బచర్ల, మహేశ్వరం, పోరండ్ల, నాగారం, తుక్కుగూడ మున్సిపాలిటీలోని రావిర్యాల గ్రామంలో బుధవారం పీర్ల ఊరేగింపును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హిందువులు, ముస్లింలు పీర్లకు దట్టీలు, ఊదు, బెల్లం, పూలు సమర్పించారు. పీర్లను ఆయా గ్రామాల్లోని వీధుల్లో ఊరేగింపు నిర్వహించి నిమజ్జనం చేశారు. ప్రజలందరినీ ఆయురారోగ్యాలతో చూడాలని అల్లాను ప్రార్థించారు. అమీర్‌పేట్‌లో బీఆర్‌ఎస్ రాష్ట్ర యువ నాయకుడు కార్తీక్‌రెడ్డి హాజరై పీర్లకు దట్టీలు కట్టి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎంఎ. సమీర్, కాంగ్రెస్ నాయకులు నసీర్‌ఖాన్, అమీర్‌పేట్, నందుపల్లి, పెండ్యాల, నాగారం, మన్సాన్‌పల్లి గ్రామాల మాజీ సర్పంచ్‌లు, మాజీ ఉప సర్పంచ్‌లు బస్వ శ్రీశైలంగౌడ్, దేశపాగ కళావతి, మంత్రి సంధ్య, బండారి లావణ్య, కంది అరుణ, ఉపసర్పంచ్‌లు పోతుల నర్సింగ్, ఉస్మాన్, ఎండీ.గౌస్,నర్సింహాయాదవ్,నాయకులుపాల్గొన్నారు.

కందుకూరు: మండల పరిధిలో మొహర్రం సంతాప దినాన్ని హిందూముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం సాయంత్రం ఆయా గ్రామాల్లో కొలువుదీర్చిన పీర్లకు ఊరేగింపు నిర్వహించారు. మతాలకు అతీతంగా పీర్ల వద్ద మొక్కులు చెల్లించుకుని మతసామరస్యాన్ని చాటారు.



కందుకూరు: కొత్తగూడలో పీర్ల వద్ద ముస్లింలు



కందుకూరు: నేదునూరులో పీర్ల చావిడి వద్ద గ్రామస్తులు